www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 డిసెంబర్ 2025
5
వైఎస్ఆర్

అప్పుల రాష్ట్రంగా మార్చారు : వైసిపి

ప్రజాశక్తి - కడప

18 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత కడప నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన పాకా సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జమ్మలమడుగు నియోజకవర్గ ముద్దనూరులో నిర్వహించిన ఎంపిపిని కూడా వైసిపి గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోచుకో దాచుకో అన్న రీతిలో రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఎవరు ప్రలోభాలకు లొంగకుండా అందరూ వైసిపికి మద్దతు ఇవ్వడంతో ఎన్ని అడ్డంకులు సృష్టించాలనుకున్న వైసిపి గెలుపు సాధించిందని అన్నారు. కూటమిపాలకులు రాష్ట్రంలో అన్ని రంగాలను అమ్మకానికి పెట్టారన్నారు.

కడప మేయర్‌గా పాకా సురేష్

- జెసి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నిక
- టిడిపి కార్పొరేటర్లు గైర్హాజర్
- అందరి సహకారంతో ముందుకెళ్తా : మేయర్

మేయర్‌గా ప్రమాణం స్వీకారం చేస్తున్న పాకా సురేష్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నూతన మేయర్‌గా పాకా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఉదయం 11 గంటలకు జాయింట్ కలెక్టర్ అధితిసింగ్ కార్పొరేషన్ సమావేశ హాలులో కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జెసి ఎన్నికల నిబంధనలను చదివి వినిపించారు. అనంతరం మేయర్ పదవి బరిలో ఒక్కరే ఉన్నారని, ఇతరులెవరైనా బరిలో ఉన్నారా అని ఇతర కార్పొరేటర్లను జెసి అడిగారు. కార్పొరేటర్ల నుంచి స్పందన లేకపోవడంతో మేయర్ బరిలో నిలిచిన 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ ఒక్కరే ఉన్నారని వివరించారు. 38 మంది వైసిపి కార్పొరేటర్లు సంఘీభావం తెలిపారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మేయర్‌గా పాకా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతనంగా ఎన్నికైన మేయర్ పాకా సురేష్‌ను సహచర కార్పొరేటర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ ఛాంబర్‌కు పాకా సురేష్ చేరుకుని జిల్లా నాయకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజద్‌బాషా, పలువురు కార్పొరేటర్లు, స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అంతకు ముందు పాకా సురేష్‌తో వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజద్‌బాషా, తాజా మాజీ మేయర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితో కలిసి వైసిపి కార్యాలయం నుంచి కార్పొరేషన్ కార్యాలయ సమావేశ హాలు వరకు ర్యాలీగా వెళ్లారు.

అందరి సహకారంతో ముందుకు : మేయర్

అందరి సహకారంతో ముందుకెళ్తానని కడప నూతన మేయర్ పాకా సురేష్ పేర్కొన్నారు. మూడున్నర నెలల తక్కువ సమయంలో తనకు చేతనైన మేరకు కార్పొరేషన్ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు. తనకు పదవి రావడంలో సహకారం అందించిన రాజకీయ నాయకులు, కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా, ప్రాంతీయ సోదరులు సైతం తనకు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో యథావిధిగా విమానయాన సేవలు

- కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సుజిత్‌కుమార్ పోద్దార్

జిల్లాలో ఎప్పటిలాగే యథావిధిగా విమానయాన సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించనున్నామని కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్‌కుమార్ పోద్దార్ తెలిపారు. ఇటీవల ఇండిగో విమాన సేవల సంక్షోభం అనంతరం భవిష్యత్తులో కడప విమానాశ్రయం అందించే మెరుగైన సేవల గురించి కడప విమానాశ్రయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. 2025 డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించిన ఇండిగో సంక్షోభం తరువాత, ప్రస్తుతం కడప విమానాశ్రయం సాధారణంగా పనిచేస్తోందని అన్నారు. అన్ని విమానాలు నిర్దిష్ట సమయానికి నడుస్తున్నాయని తెలిపారు. సగటున రోజూ 200 మంది ప్రయాణికులు కడప విమానాశ్రయం నుండి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈనెల 4న విమాన రాకపోకలలో 2 గంటలకు పైగా ఆలస్యం అయిందని దీనిని మినహా కడప విమానాశ్రయంలో ఎటువంటి విమాన రద్దు జరగలేదని తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఇండిగో సంస్థ ముందుగానే సమాచారం అందించిందన్నారు. ప్రస్తుతం కడప విమానాశ్రయంలో ప్రయాణికులకు సంబంధించి డెలివరీ చేయాల్సిన బ్యాగేజ్ ఏదీ పెండింగ్‌లో లేదని తెలిపారు. ప్రస్తుతం కడప నుంచి హైదరాబాదుకు రోజూ, చెన్నై, విజయవాడలకు రోజుమార్చి రోజు విమానాలు నడుపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ నుంచి విమానం (రోజూ మధ్యాహ్నం 12:40 గంటలకు వచ్చి, అక్కడి నుండి చెన్నై, విజయవాడకు (రోజు మార్చి రోజు) వెళ్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే విమానం రోజూ సాయంత్రం 3:30 గంటలకు ఉంటుంది అని తెలిపారు. హైదరాబాద్, చెన్నై విమానాలు ప్రయాణికులకు గల్ఫ్ దేశాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే కనెక్టింగ్ విమానాలను అందుకోవడానికి సహాయపడతాయని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం స్నాక్స్ బార్, కార్ రెంటల్ సర్వీస్ వంటి కొత్త సదుపాయాలు విమానాశ్రయంలో ప్రవేశపెట్టబడ్డాయన్నారు. త్వరలో ఇవి ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం కానుందని ఆయన చెప్పారు. ప్రయాణికుల సహాయార్థం 'మేఐ హెల్ప్ యు' డెస్క్, కొత్త బేబీ కేర్ (శిశు సంరక్షణ) సేవ, కొత్త స్నాక్ బార్ సౌకర్యం త్వరలో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. హైదరాబాద్ నుంచి కడపకు మరో రోజువారీ విమానం, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరులకు రోజువారీ విమానాలు నడపడం వంటి కొత్త మార్గాలను జోడించాలని ఎఎఐ ఇండిగో, ఇతర విమానయాన సంస్థలను కోరిందని చెప్పారు. కడప విమానాశ్రయంలో 2023 నుంచి నైట్ ల్యాండింగ్ సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ తోపాటు ఆపరేషన్స్ మేనేజర్ దామోదర్ రెడ్డి, ఎస్‌పి ఎఎఫ్ కె.ఆర్ముగం పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

14 నుంచి ఇంధన పరిరక్షణ వారోత్సవాలు

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలో ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం తిరుపతి బ్రాంచ్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈనెల 14 నుంచి 20 వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో ఈనెల 19, 20 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు ఇంధన పరిరక్షణ – అవశ్యకత అంశంపై స్టాల్స్ ఏర్పాటు పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వతరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంధన పరిరక్షణఅంశంపై సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో విద్యార్థులకు వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొని, గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 17 న తిరుపతి నుంచి ఆన్లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, విజేతలకు ఈనెల 20వతేదీన బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పి డైరెక్టర్ కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, ఎం. ఉమాపతి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్రశేఖరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయప్రకాష్, ఎన్‌జిఒ సంస్థ ప్రతినిధి మధుబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కలసపాడు

దుప్పట్లు, దుస్తులు పొందిన వృద్ధులు

పోరుమామిళ్లలోని చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకొని వృద్ధులకు దుస్తులు, చలి దుప్పట్లను వితరణ చేశారు. వాటిని సంస్థ ప్రతినిధులు ఎల్. ప్రసాద్‌రెడ్డి, జి. శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సింగరాయపల్లి గ్రామపంచాయతీ, సర్పంచ్ వోసూరి సంజయ్ చేతుల మీదుగా చుట్టుపక్కల గ్రామాల పుల్లారెడ్డిపల్లె, తెల్లపాడు, రామాపురం, రెడ్డిపల్లి, హృదయ పేట, నరవ నుండి వచ్చిన 200 మంది వృద్ధులకు ఉచితంగా దుస్తులు, చలి దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద వృద్ధులకు ఇలాంటి సహాయ సహకారాలు అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ సహకారాలు మా పంచాయతీ పరిధిలోని గ్రామాలలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు గ్రామ సర్పంచ్, సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో అన్ని శాఖలకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న భివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని జెసి అదితి సింగ్ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, ఎన్టీఆర్ భరోసా, దీపం గ్యాస్, రేషన్ సరఫరా, వరి ధాన్యం కొనుగోలు, ప్రజా రవాణా సేవలు, రిజిస్ట్రేషన్ సర్వీసులు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జెసి హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో జెసి మాట్లాడుత రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, గ్యాస్ సరఫరాలో డెలివరీ బాయ్స్ కమీష న్లను అరికట్టే చర్యలు, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 15లోగా జిల్లాలో అన్ని రంగాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ హజరతయ్య, అధికారులు పాల్గొన్నారు.

'14న బుద్ధుడితో నా ప్రయాణం'

ప్రజాశక్తి - కడప అర్బన్ : బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కడప హరిత ఫంక్షన్ హాల్‌లో 'బుద్ధుడితో నా ప్రయాణ' నాటక ప్రదర్శనను ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు పిళ్లా కుమారస్వామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం సొసైటీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ నాటకం ప్రధానంగా అంబేద్కర్ తాను బౌద్ధంతో ఎలా మమేకమైంది, ఎలా అర్థం చేసుకున్నారు, దానిని రాజ్యాంగంలోకి ఎలా తీసుకుని రాగలిగారో వివరిస్తుందని అన్నారు. విలువలను, మానవతా ధర్మాలను, బౌద్ధం మన జీవితంపై ప్రభావితం చేస్తున్నటువంటి అంశాలను ఈ నాటకం స్పష్టం చేస్తుందన్నారు. రిటైర్డ్ ఈఈ గుర్రప్ప మాట్లాడుతూ బౌద్ధంతో నా ప్రయాణం నాటకం మానవ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, మానవ సమాజంలో బౌద్ధ విలువలను నేటి సమాజానికి ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు, సీనియర్ అడ్వకేట్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఈ నాటకం ఒక సినిమా లాగా ఉండే విధంగా అద్భుతంగా నవీన సాంకేతికతో రూపొందించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చూడదగ్గ నాటకమని చెప్పారు. బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నాటకాన్ని ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సహాయ కార్యదర్శి మల్లెల భాస్కర్ మాట్లాడుతూ ఈ నాటకం అన్ని వర్గాలను ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటుందని తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపురంలో గాలిమర పరిశ్రమ

- 27 మెగావాట్ల ఉత్పాదన ప్రాజెక్టు ఏర్పాటు
- 3 గ్రామాల్లోని 45 ఎకరాలు కేటాయింపు
- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కొండాపురం మండలంలో గాలిమర ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మండల పరిధిలోని కొప్పోలు, చామలూరు, టి. కోడూరు గ్రామాల పరిధిలోని 45 ఎకరాల ప్రభుత్వ భూములను పెన్నార్ విండ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. మండల పరిధిలోని కొప్పోలు గ్రామంలో ఐదు ఎకరాలు, చామలూరులో 10 ఎకరాలు, టి.కోడూరులోని 955, 996 సర్వే నెంబర్ల పరిధిలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించ నుంది. పెన్నార్ విండ్ పవర్ ప్రాజెక్టు 27 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయనున్నట్లు పేర్కొంటోంది. హైదరాబాద్‌కు చెందిన ఎం. ఎస్.హెచ్‌ఐ విండ్ పవర్ (పెన్నార్) ప్రయివేట్ లిమిటెడ్‌కు అనుకూలముగా ప్రభుత్వ భూమి లను బదిలీ చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

నీటి భద్రతతోనే దేశ భవిష్యత్తు

- జిల్లాలో సమర్థవంతమైన నీటి భద్రతకు ప్రణాళికలు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

నీటి భద్రతతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఇందుకు జిల్లాలో సమర్థ వంతమైన నీటి భద్రత, సంరక్షణ, నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో జలశక్తి, నీతి ఆయోగ్ సంయుక్తంగా నిర్వహించిన ఇండియా వాటర్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో జిల్లా రివర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఫ్రేమ్‌వర్క్) కింద జిల్లా స్థాయి నీటి నిర్వహణపై ప్యానలిస్ట్‌గా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సదస్సులో మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలిక నీటి భద్రత కోసం నాలుగు పద్ధతులను వివరించారు. వర్షపు నీటిని సంరక్షించడం, నదుల ప్రవాహ నిర్వహణను మెరుగుపరచడం, భూగర్భజలాల నీటి మట్టాన్ని పెంచడం, ప్రణాళిక బద్ధంగా జలాశయాల నీటి నిర్వహణ, సమర్థవంతమైన నదీ పరీవాహక నిర్వహణ కోసం పంటలు పర్యావరణ వ్యవస్థలకు తేమ నిలుపుదల శాతాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నీటిపారుదల, తాగునీరు, ఆరోగ్యం, పర్యావరణ నిర్వహణలోని అంతరాల నిర్మూలన, వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి వ్యవస్థ, చిత్తడి నేలల పునరుద్ధరణ, చెక్ డ్యాములు, బిందు సేద్యం, కచ్చితమైన వ్యవసాయ పద్ధతులు, భూగర్భ జలాల పునరుద్ధరణ వంటి అంశాల అమలు, వ్యవసాయంలో సమర్థ వంతమైన నీటి వినియోగం వంటి కేంద్రీకృత మార్గాల ద్వారా పరిష్కరించ వచ్చు నని వివరించారు. డిస్ట్రిక్ట్ వాటర్ గవర్నెన్స్ కమిటీని, డిస్ట్రిక్ట్ పిఎంయు (ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ యూనిట్)ని ఏర్పాటు చేయా లని సదస్సులో కలెక్టర్ చెరుకూరి ప్రతిపాదించారు. ఈ ఇంటిగ్రేటెడ్ ఫోర్ వాటర్ విధానం జిల్లాలలో సమర్థ వంతంగా అమలు ద్వారా సంపూర్ణ, సుస్థిరాభివృద్ధి ఆధారిత నీటి నిర్వహణకు మార్గదర్శకంగా నిలుస్తుందని వివరించారు.

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే లక్ష్యం

- సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి జి.శివకుమార్

ప్రజాశక్తి - బద్వేలు

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సిఐటియు) బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖ పట్నంలో నిర్వహించబోయే సిఐటియు అఖిలభారత 18వ మహాసభల విజయవంతం కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి జి శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ కార్మిక హక్కులను కాలరాసే విధంగా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మారుస్తు తుందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తుందని, రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులతో సహా ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న 12వ పిఆర్‌సిని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించి జీతాలు పెంచాలని, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన 13 గంటల పని దినాన్ని రద్దు చేయాలని, మహిళ కార్మికులతో రాత్రిపూట షిఫ్ట్‌లలో పని చేయించే విధానాన్ని స్వస్తి పలకాలని, రిటైర్మెంట్, అనారోగ్యం, చనిపోయిన వారి స్థానాలలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తెలిపారు. నిరంతరం పాలక ప్రభుత్వాలపై ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు విజయవంతం పట్టణంలోని వ్యాపారులు, ఉద్యోగులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు విరివిగా విరాళాలు అందించి కార్మిక వర్గ పోరాటాలను బలపరచవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు పఠాన్ చాంద్‌బాషా, కాలువ శివకుమార్, పట్టణ నాయకులు గంప అనంతమ్మ, షేక్ ఖైరూన్ బీ, మురా ప్రసాద్, కార్యకర్తలు సుధాకర్, బాలస్వామి, బాలమ్మ, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - వల్లూరు : విధుల్లో అలసత్వంపై సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వల్లూరు టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. 150కి పైగా అర్జీలు రాగా, హౌసింగ్, పెన్షన్ సమస్యలే అధికంగా ఉన్నాయి. కొన్ని అక్కడి కక్కడే పరిష్కరించారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా విధుల్లో అలసత్వంపై వల్లూరు సచివాలయ డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పథకాలను ప్రజలకు చేరవేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీ వాణి, ఎంపిడిఒ రఘురాం, సహకార బ్యాంక్ సొసైటీ చైర్మన్ లేబాక నాగేశ్వర్ రెడ్డి, మండల అధికారులు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షలు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన కేంద్రాలలో కొనసాగుతూ ఉన్నాయి. గురువారం ఉదయం ఐదు కేంద్రాలలో 710 మంది అభ్యర్థులకు గాను 674 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు కేంద్రాలలో 710 మంది అభ్యర్థులకు గాను 664 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డిఇఒ షంషుద్దీన్ పర్యవేక్షించారు.

యుటిఎఫ్ కడప మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్



ఎ. చెన్నయ్య



వెంకట రమణమ్మ

యుటిఎఫ్ కడప మండల కమిటీ గురువారం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా ఎన్.శివశంకర్ బాబు, అధ్యక్షులుగా వై.వెంకట రమణమ్మ, సహాధ్యక్షులుగా అనుపూర్ మహబూబ్ బాషా, ఎం.సి.సరోజ ప్రధాన కార్యదర్శిగా ఎ.చెన్నయ్య, ట్రెజరర్‌గా ఎస్.మొహమ్మద్ అశ్వాక్ అహమ్మద్, మండల కార్యదర్శులుగా ఎస్.ముజుబూర్ రహిమాన్, ఎం.నాగరాజు, వి.రమణమ్మ, ప్రసూన, వి.లక్ష్మి నారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా వి.గోపాల్ రెడ్డి, ఆర్.మాబున్ని, కె.విజయకుమారి, లక్ష్మణరావు, ఎం.సి.నాగన్న, ఎం.సూర్య ప్రకాష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.మధు సుధన్ ఎన్నికయ్యారు.

డిగ్రీ 4వ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో నాలుగో సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 19న ఉదయం 10 గంటలకు విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసుకున్నవారు 4 ఏళ్ల యు.జి. ఆనర్స్‌లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్ణీత రుసుంను డిడి రూపంలో తీసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు www.yvu.edu.in ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి సాధన కోసం ఉద్యమిస్తాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో యువతకు నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు ఆ హామీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎం ప్లాయిమెంట్ కార్యాలయంలో అధికారికంగా నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య 46,371 మంది ఉన్నారని అనధికారికంగా లక్షకు పైగా జిల్లాలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ ఉన్నారన్నారు. ఇలా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఇంత వరకు అమలు కాలేదన్నారు. అందులో ముఖ్యంగా నిరుద్యోగ యువతకు రూ. 3000 భృతి ఒకటి అన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు కట్టుకుంటూ తల్లిదండ్రులకు భారం కాలేక తీవ్ర సతమతమవుతున్నారని పేర్కొన్నారు. అటువంటి యువతకు ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతి చాలా వరకు ఉపశమనంగా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో అన్ని అమలు చేశామని చెబుతున్నారని, నిరుద్యోగ భృతి సంగతి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం యువతకు భృతి ఇస్తానన్న హామీ అమలు చేయాలని, లేకుంటే నిరుద్యోగుల పక్షాన భవిష్యత్‌లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు పెద్దన్న, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛ కడపకు సహకరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని 47వ డివిజన్ శాస్త్రినగర్ పరిధిలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రతిష్టాత్మక 'మన కడప–స్వచ్ఛ కడప' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రాంతంలోని శుభ్రత పనులు, డ్రెయినేజీ చెత్త నిర్వహణ, పౌరసౌకర్యాలపై అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికంగా పరిశుభ్రత పనులు మరింత సమర్థవంతంగా కొనసాగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. స్వచ్ఛ కడపకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి రెడ్డి హుస్సేన్, బూత్ ఇన్‌ఛార్జి చిన్న హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, వెంకట రామిరెడ్డి, హరి, జీవన్, పాల్, ఆదిలక్ష్మి, సుభాహన్, ఇబ్రహీం, హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ..** 4వ డివిజన్ ఆర్.కె .నగర్‌లోని శాంతి నగర్‌లో రూ. 41.30 లక్షలతో సిసిరోడ్డు నిర్మాణం, రూ.4.2 లక్షలతో కొత్త బోర్ వెల్, రూ44 లక్షలతో డ్రెయినేజీ కల్వర్టుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప నగరాన్ని క్రమంగా అభివృద్ధి పరుస్తూ వెళుతున్నామని పేర్కొన్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్, 4వ డివిజన్ ఇన్‌ఛార్జి యాటగిరి రాంప్రసాద్, టిడిపి నేతలు చల్లా రాజా, ఆవుల వెంకటేష్, పసుపులేటి వినోద్, ప్రసన్న, పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయకపోతే

ఉద్యమం ఉధృతం చేస్తాం : జెఎసి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప జిల్లాలోనే ఉంచే వరకూ ఉద్యమం ఉధృతం చేస్తామని జెఎసి నాయకులు పేర్కొన్నారు. ఒంటిమిట్ట మండలాన్ని అన్నమయ్య జిల్లా రాయచోటిలో విలీనంపై మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చెక్‌పోస్టు వద్ద గురువారం 2వ రోజు నిరాహార దీక్షలు కొనసాగాయి. విలీనం గెజిట్ నోటిఫికేషన్ రద్దు పరచకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జెఎసి సభ్యురాలు ఏకుల రాజేశ్వరిరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరం ఒకే మాట, బాటగా జెఎసి ఏర్పాటు చేసుకొని సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలో విలీనం చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు. సిద్ధవటం ఒక చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రమని జిల్లా కేంద్రంగా పరిపాలన చేసిన తమ మండలాన్ని ఎడారి జిల్లాలో విలినం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. ఆంధ్ర రాష్ట్రానికి రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట పుణ్యక్షేత్రాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబు ప్రజల మనోభావాల అనుగుణంగా గెజిట్ నోటిఫికేషన్ రద్దుచేసి రెండు మండలాలను కడప జిల్లాలో విలీనం చేయాలని లేనిపక్షంలో ప్రజా ఆగ్రహం తప్పదని తెలిపారు, జెఎసి సభ్యులు నాగం నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా పరిపాలన చేసిన సిద్ధవటం మండలం ఎంతో ప్రసిద్ధిగాంచిందని నవాబులు, మట్లి రాజులు పరిపాలించిన పురాతనమైన కోట పచ్చదనం, ఉట్టిపడేలా లంకమల, పాలకొండలు వంటి ప్రసిద్ధిగాంచిన సిద్ధవటాన్ని ఎడారి జిల్లా రాయచోటిలో విలీనం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఒంటిమిట్టలో కోదండ రామయ్య సాక్షాత్తు నిలువైన పుణ్యక్షేత్రాన్ని ఎక్కడ విలీనం చేశారో అధికారులు పరిశీలించాలని గుక్కెడు త్రాగునీరు అందని గడ్డలో విలీనం చేయడంపై రామయ్య భక్తులకు ద్రోహం చేశారని తెలిపారు. గెజిట్ నోటిఫికేషన్ రద్దు పరిచి రెండు మండలాలు కడప జిల్లాలో కొనసాగే విధంగా అధికారులు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని అన్నారు. కార్యక్రమంలో జెఎసి సభ్యులు తుర్ర ప్రతాప్ నాయుడు, కాడే చెంచయ్య నాయుడు, నాగం నరసింహారెడ్డి, కెవి సుబ్బయ్య, కాడే శ్రీనివాసులు నాయుడు, సుబ్బరాయుడు, రెడ్డయ్య, నగేష్ నాయుడు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని శాసనమండలి సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక హాకీ స్టేడియంలో అండర్-17 హాకీ ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలు తిలకించడానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. అనంతరం గెలిచిన జట్లకు ఆయన బహుమతులు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. కడప టీం మొదటి స్థానాన్ని, విశాఖపట్నం టీం రెండవ స్థానాన్ని, పశ్చిమ గోదావరి టీం మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు

అన్నా క్యాంటీన్లో పేదలతో కలిసి అన్నం తింటున్న భూపేష్ రెడ్డి

పిఆర్ బురదజల్లడం మానుకోవాలి : భూపేష్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రతిపక్ష నేతగా విమర్శించాలే కానీ బురదజల్లడం మానుకోవాలి, లేకుంటే ఓపెన్‌గా మాట్లాడాల్సి ఉంటుందని టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. స్థానిక అన్నా క్యాంటీన్‌ను గురువారం ఆయన సందర్శించి, అక్కడే ఉన్న ప్రజలతో కలిసి అన్నం తిన్నారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్ వద్ద పేదల కళ్లల్లో ఆనందం చూశామన్నారు. మంచి ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. పి.రామ సుబ్బారెడ్డి ప్రతిపక్ష నేతగా కాకుండా బురదజల్లే మాటలు మాట్లాడడం సబబు కాదన్నారు. హుందాగా వ్యవహరించాలని సూచించారు. 30ఏళ్ల రాజకీయ జీవితంలో 20ఏళ్లు పార్టీలోనే ఉన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం మీరు అభివృద్ధి చేశారా.. దేవగుడి కుటుంబం అభివృద్ధి చేసిందా అనేది ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ టి మల్లికార్జున, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, రాజీవ్‌నగర్ కాలనీ డీలర్ రవి, పొన్నతోట శీను, బిర్రు సంతోష్, అన్న క్యాంటీన్ మేనేజర్ గురుస్వామి పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు అలీషేర్

సమాజ మార్పుకోసం పనిచేద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సమాజ మార్పుకోసం పని చేద్దామని షేర్ మానవ హక్కుల రాష్ట్ర చైర్మన్ అలీ షేర్ తెలిపారు. స్థానిక పలగాడి మోటులోని కార్యాలయంలో సామాజిక న్యాయం కోసం ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు చైతన్యవంతులై సమాజాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలన్నారు. మహిళా సాధికారత కోసం తమ షేర్ మానవ హక్కుల సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో షేర్ మానవ హక్కుల సంఘం పట్టణ అధ్యక్షులు షేక్ సద్దాం, స్పోక్ పర్సన్ సయ్యద్, మాక్ మూర్, రాష్ట్ర ఇన్‌ఛార్జి షేక్ గఫూర్, సయ్యద్ సహబుద్దిన్, ఉమెన్ వర్కింగ్ ప్రెసి డెంట్ అనూష, కడప జిల్లా మహిళా ప్రెసిడెంట్ సరస్వతి, మహిళలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రత్యేక అవసరాలు గల అనాథ పిల్లలకు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశామని హ్యూమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గౌతమబోయిన గురుమూర్తి యాదవ్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో వారు హ్యూమన్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల లీగల్ సెల్ వైస్ చైర్మన్ కుంటుమల్ల రామమోహన్, రాష్ట్ర వైస్ చైర్మన్ కొత్తమాస్ భాస్కర్ బాబు, రాష్ట్ర పబ్లిక్ రిలేషన్ వైస్ చైర్మన్ శివ నారాయణ, జిల్లా అధ్యక్షురాలు రాణెమ్మ, న్యాయవాది బేబీ రమ్య, స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌వి కంటి తుడుపు చర్యలే

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ చెప్పేవన్నీ కంటి తుడుపు చర్యలేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతోపాటు పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చడం వంటి వాటిని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. గ్రామీణ స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు నిధులు లేక అధికారాలు లేక నీరసంచి, నిర్వీర్యమై ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని తులసిరెడ్డి సూచించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అభాగ్యులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణంలో రోడ్లు, బస్టాండ్, ఆలయాల పరిసరాల్లో ఉంటున్న అభాగ్యులకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. మగత నిద్రలో ముడుచుకొని కొందరు, మూలుగుతూ కొందరు పడుకున్న వారిని గుర్తించి దుప్పట్లు కప్పారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చలి నుండి నిరాశ్రయులైనవారికి చేయూతనిచ్చేందుకు దాతల సహకారంతో ప్రతి ఏటా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దుప్పట్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.శ్రీనివాసరెడ్డి, టి.వెంకట సురేష్, కె.శ్రీనాథ్, ఎం.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న సంస్థ ప్రతినిధులు

విద్యుత్ సమస్యల్ని పరిష్కరించాలి

సమావేశానికి అధికారుల గైర్హాజర్‌పై సభ్యుల ఆగ్రహం - రబీలో ఆరుతడి పంటలకే నీరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో నెలల తరబడి అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపిపి టి.లక్ష్మమయ్య అధికారులకు సూచించారు. 18 నెలలుగా రెగ్యులర్ ఎఇ లేకపోవడంతో చాలావరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు అవుతున్నారని సభ్యులు మండిపడ్డారు. తహశీల్దార్ రమాకుమారి కార్యాలయంలో అందుబాటులో ఉండి కూడా సమావేశానికి రాకపోవడమేమిటని సభ్యులు ప్రశ్నించారు. రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని సమస్యలు ఎవరికి చెప్పాలని సభ్యులు పేర్కొన్నారు. సమావేశానికి రాని మండల అధికారులకు నోటీసులు జారీ చేయాలని సభ్యులు తీర్మానించారు. గ్రావెల్ రోడ్లు మంజూరు చేయాలని, పంట పొలాలకు దారులు సరిగా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అధికారులకు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గిట్టుబాటు ధరతో వరి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని సభ్యులు కోరారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో సరిగా విధులు నిర్వహించడం లేదని తెలిపారు. టిఓ పల్లె సర్పంచ్ మునీంద్ర మాట్లాడుతూ పంచాయతీలో సొంత నిధులు ఉపయోగించి పనులు చేపడితే బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కెసి కెనాల్ ఏఈ గురుమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో రెండవ పంటకు సరిపడే నీరు అందుబాటులో ఉన్నప్పటికీ తుంగభద్ర డ్యాం గేట్ల మరమత్తుల కారణంగా నీటిని సరఫరా చేయలేని పరిస్థితి ఉందన్నారు. రైతులు ఈ ఏడాది కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. మార్చి చివరి వరకు విడతలవారీగా నీటిని విడుదల చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో వీరకిషోర్, ఉప ఎంపిపి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ హరినాథ్, ఏఓ దేవి పద్మలత, ఎంఈఓ రవిశంకర్, పిఆర్ ఏఈ చంద్రమౌళి, పశువైద్యాధికారి సుదర్శన్ రెడ్డి, ఉపాధి ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముద్దనూరు ఎంపిపిగా వెన్నపూస పుష్పలత ఎన్నిక

పుష్పలతలకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఆర్‌డిఓ సాయిశ్రీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఎంపిపిగా వైసిపికి చెందిన కొర్రపాడు ఎంపిటిసి వెన్నపూస పుష్పలత ఎన్నికయ్యారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి, జమ్మలమడుగు ఆర్డిఒ సాయిశ్రీ, ఎన్నికల పరిశీలకులు, డిఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపిపి పదవికి ఉప ఎన్నిక నిర్వహించారు. వైసిపికి చెందిన 6 మంది ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు ఉప ఎన్నికలో పాల్గొన్నారు. ముద్దనూరు-2 ఎంపిటిసి ఇంద్రాణి ప్రతిపాదించగా ఉప్పలూరు ఎంపిటిసి వీర రేణుక బలపరిచి పుష్పలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపిపిగా ఎన్నికైన పుష్పలతతో ఎన్నికల అధికారి సాయిశ్రీ ప్రమాణం చేయించి డిక్లరేషన్ ఫారం అందజేశారు. ముద్దనూరు-3 ఇండిపెండెంట్ ఎంపిటిసి లక్ష్మి కాంతమ్మ, దేనేపల్లె బిజెపి ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, యామవరం ఎంపిటిసి మాధవి ఎన్నికకు గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు డిఎస్పీ వెంకటేశ్వర రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాధాకృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిపి విజయం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకం : ఎంపీ

ముద్దనూరు వైసిపి ఎంపిపి విజయానికి కృషి చేసి కార్యకర్తల్లో స్ఫూర్తి నింపిన మహిళా ఎంపిటిసిలు ఆదర్శనీయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీవివేక వర్ధిని జూనియర్ కళాశాల వద్ద గురువారం ఎంపిపి పుష్పలత, ఎంపిటిసిలు ఎంపీ, ఎమ్మెల్సీని కలిశారు. ఎంపిపి, ఎంపిటిసి లను అవినాష్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముద్దనూరులో 6మంది ఎంపిటిసిలకుగానూ 5 మంది మహిళా ఎంపిటిసిలు వైసిపి విజయానికి కృషి చేశారన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా సహకరించిన మహిళా ఎంపిటిసిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ పిఆర్ మాట్లాడుతూ కడప జిల్లాలో కూటమి ప్రభుత్వం ఎన్నో ప్రలోభాలు, బెదిరింపులు, ఒత్తిళ్లకు గురి చేసినా మహిళా ఎంపిటిసిలు ధైర్యంగా నిలబడి వైసిపి విజయానికి కృషి చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ప్రజలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - దువ్వూరు

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రోషిణి

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సంచార చికిత్స కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రోషిణి పేర్కొన్నారు. గురువారం చిన్న సింగనపల్లె గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రోషిణి ఫ్యామి లీ కాన్సెప్ట్ విధానాన్ని పరిశీలిస్తూ.. ఈ విధానం ద్వారా దాదాపు 14 రకాల పరీక్షలు 65 రకాల మందులను అందించనున్నట్లు తెలి పారు. కార్యక్ర మంలో పిహెచ్ఎన్ శాంతకుమారి, సిహెచ్ఓ చొక్కం హరి చం దన, ఏఎన్ చంద్రకళ, 104 డీఈవో రామచంద్రారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, ఇతర వనరులను ఉపయోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. చాపాడులో గురువారం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ మొదటి వార్షిక సామాన్య సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎడిఎ మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘం ద్వారా రైతులకు అవసరమైన సామాగ్రిని ప్రభుత్వం అందిస్తుందన్నారు. సుస్థిర వ్యవసాయానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పలు అంశాలపై వివరంగా చర్చించారు. కార్యక్రమంలో సిఎస్‌పి స్టేట్ కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, ఎఓ దేవిపద్మలత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున నాయుడు, ఎఫ్ఈఓ చైర్మన్ జి.సుబ్బరాయుడు, సిఈఓ స్రవంతి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఓబులేసు, మహబూబ్ బాషా, సన్నీ, పవన్‌కుమార్, అభిషేకం, మౌనిక, అశ్వర్థరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల ఘటనల నివారణపై శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడి ఘటనలను అరికట్టేందుకు, వివిధ శాఖల ఫ్రంట్‌లైన్ వర్కర్లకు అవగాహన కల్పించారు. చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల స్థాయి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పోలీస్‌శాఖ, గ్రామస్థాయి ఆరోగ్య సిబ్బంది, పౌరసమాజ సంస్థలు కార్యక్రమంలో పాల్గొన్నాయి. డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల రక్షణలో సమన్వయం ఎంతో కీలకమన్నారు. బాలల లైంగిక దాడి కేసుల్లో ఫోరెన్సిక్ పరీక్షలు, మెడికో-లీగల్ రిపోర్టుల ప్రాముఖ్యత, పోక్సో చట్టం కింద వైద్యుల బాధ్యతలు, కేసు నమోదు తర్వాత ఆరోగ్య కేంద్రాలు అనుసరించాల్సిన ప్రోటోకాల్స్‌పై స్పష్టమైన సూచనలిచ్చారు. పిల్లలపై లైంగిక దాడి కేసులను రహస్యంగా ఉంచకూడదన్నారు. ప్రతి కేసును చట్టపరంగా నమోదు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. డాక్టర్ శ్రీవాణి, ఓబులేసు, సోషల్ వర్కర్ పి.భాస్కర్, సైకాలజిస్ట్ కె.శిల్పా, సూపర్వైజర్లు బాబుల్‌రెడ్డి, సుకన్య, లక్ష్మిదేవి, ప్రసాద్, భవాని, భాస్కర్, ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్య, పోలీస్, సివిల్ సొసైటీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాట్సాప్, ఫేస్‌బుక్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గురువారం ఆయన మునిసిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు అంతర్జాలంలో అనవసరపు యాప్‌ల జోలికి పోకూడదన్నారు. విజ్ఞానానికి అవసరమైన వాటిని మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. కొంతమంది నిరంతరం సెల్‌ఫోనుకు అలవాటు పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోటీ పరీక్షల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రాయపేట డిప్యూటీ ఎంపిడిఒగా అలీఖాన్

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట డిప్యూటీ ఎంపిడిఒగా జుబేర్ అలీఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. మండలంలో కనీస సౌకర్యాలు తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలను ఎంపిడిఒ కె.శివారెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ సిబ్బంది ఉన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు.

సమాజాభివృద్ధికి దాల్మియా భారత్ మరో ముందడుగు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడపలో ఆర్ఓ ప్లాంట్, స్టేజ్ షెల్టర్ ప్రారంభంతో సమాజాభివృద్ధికి దాల్మియా భారత్ మరో ముందడుగు వేసిందని డిసిబిఎల్ కడప యూనిట్ హెడ్ ప్రియా రంజన్ తెలిపారు. మండల పరిధిలోని మనోవికాసం కేంద్రం వద్ద గురువారం ఆయన బాలలకు అవగాహన కల్పించారు. భారతదేశంలోని ప్రముఖ సిమెంట్, షుగర్ కాంగ్లోమెరేట్ దాల్మియా భారత్ గ్రూప్ వ్యవస్థాపకుడు జై దయాల్ దాల్మియా జీ 121వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 4 నుంచి 11 వరకు దేశవ్యాప్తంగా 'సేవా దివాస్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 25 ప్రాంతాల్లో ఉద్యోగులు, భాగస్వాములు, స్థానిక ప్రజలు మొక్కలు నాటడం, పరిశుభ్రత డ్రైవ్‌లు, రీసైక్లింగ్ అవగాహన, అనాథాశ్రమాలు-వృద్ధాశ్రమాల్లో అన్నదానం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాల్మియా సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్బయ్య

పార్టీకి బూత్ కమిటీలే మూల స్తంభాలు

ప్రజాశక్తి - వేముల

తెలుగుదేశం పార్టీకి బూత్ లెవెల్ కమిటీలే మూల స్తంభాలని దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్యను మండలంలోని పలు బూత్‌ల పరిశీలకుడిగా నియమించారు. ఆ మేరకు గురువారం ఆయన మండలంలోని పెద్దజటూరు, చింతల జూటూరు తదితర గ్రామాల బూత్ ఇన్‌ఛార్జిలను కలిసి ఆయా గ్రామాల పార్టీ స్థితిగతులపై చర్చించారు. బూత్ కమిటీ ఇన్‌ఛార్జిల సూచనలు ఇక్కడ పరిస్థితులను పార్టీకి నివేదిక రూపంలో అందిస్తామని తెలిపారు. బూత్ లెవెల్ కమిటీ నిర్ణయాలు, సూచనలను పార్టీ పరిశీలిస్తుందని సుబ్బయ్య వివరించారు. టిడిపి మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, పసుపులేటి మనోజ్‌కుమార్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

మసీదు రోడ్డుకు మరమ్మతు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అమృత్‌నగర్ మసీదు వద్ద ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండి స్థానికులకు ఇబ్బందికరంగా ఉండేది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత యువకులు, ఆటోడ్రైవర్లు చొరవ చూపి శ్రమదానం చేశారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని మట్టి తోలించమని అడగ్గా, అంగీకరించడంతో రోడ్డును బాగు చేసుకున్నారు. యువకులు శ్రమదానం చేసి ఆటోడ్రైవర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రోడ్డును బాగు చేశారు.

నోటీసు బోర్డు వల్ల మృతుడి గుర్తింపు

ఎర్రగుంట్ల : పట్టణంలో ఇటీవల గుర్తు తెలియని ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడి ఫోటోను పలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో అతికించామని రైల్వే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య, కుమారులు ఫోటోలు చూసి గుర్తించారన్నారు. ఆ మేరకు గురువారం రైల్వే పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ మాట్లాడుతూ అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన మహబూబ్ బాషాకు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. ఈ క్రమంలో 8వ తేదీ తన నివాసం నుంచి బయలుదేరి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో కదులుతున్న రైలు కిందపడి మహబూబ్ బాషా ఆత్మహత్య చేసు కున్నాడని వివరించారు. 9వ తేదీ గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల అర్బన్ ఎస్ఐ లంకె తిమోతి హెచ్చరించారు. కలసపాడులో ఎస్ఐగా పనిచేస్తున్న తిమోతి ఇటీవల ఎస్ఐల బదిలీల్లో పులివెందుల అర్బన్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ పులివెందల అర్బన్ పరిధిలో చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఉపేక్షించలేదన్నారు. ముఖ్యంగా మట్కా, పేకాట వంటి వాటిపై ప్రత్యేకదృష్టి పెట్టి అరికడతామన్నారు.

IN THE CORUT OF THE PRL DISTRICT JUDGE : KURNOOL
M.V.O.P.NO.276/2024

Vadla Karim basha. ...Petitioner
-VS-
Mallela Raghukumar Reddy and others. ...Respondents

NOTICE TO RESPONDENT NO.4

4) అకుతోట ప్రసాద్ తండ్రి ఎ.లక్ష్మయ్య, మజీద్‌వాది, లక్కిరెడ్డిపల్లి (గ్రా), వై.ఎస్.ఆర్ జిల్లా.

పై నెంబర్ ఎం.వి.ఓ.పిలో 16-04-2024 తేదిన అర్జిదారుకు రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయములకు నష్టపరిహారముగా రూ॥10,00,000/-లు ఇందు పైన ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డితో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని పై కోర్టులో అర్జిదాఖలుచేసినాడు. ఇందులో R4 అయిన నీకు ఆక్షేపణ ఉన్న 29-12-2025 తేదిన పై కోర్టులో హాజరై తెలుపు కొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

యం.నాగేశ్వర రెడ్డి,
వై.రాఘవేంద్రారెడ్డి,
అర్జిదారుపరం అడ్వకేట్లు,
కర్నూలు.

గోకులం మిషన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పశువుల రోగాల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పశువులకు వచ్చే రోగాలపై వాటి యజమానులకు అవగాహన ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గొరిగనూరులో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశుపోషకులు, గొర్రెల కాపరులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పశువులు, గొర్రెల్లో ఏవైనా తేడాలు గమనిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలన్నారు. శిబిరంలో 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 18 పశువులకు చూడి పరీక్షలు, 48 పశువులకు సాధారణ చికిత్స, 28 దూడలకు, గొర్రెలలో నట్టల నివారణ మందులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ దేవగుడి, కడప అధికారులు కె.సుధాకర్ రెడ్డి, ఆర్.సుధాకర్, విలేజ్ వెటర్నరీ సహాయకులు హబీబ మున్నీషా, జి.కావేరి, జి.పెద్దక్క, ఎస్.రమాదేవి, జి. సమీరా, గోపాలమిత్ర శ్రీని వాసులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు : డిప్యూటీ ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తానని డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన గురువారం డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయ వ్యవస్థకు సంబంధించి సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. విధుల పట్ల సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ పక్కాగా నిర్వహించాలన్నారు.

రమణయ్యను సత్కరిస్తున్న ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది

డిప్యూటీ ఎంపిడిఒగా రమణయ్య

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె డిప్యూటీ ఎంపిడిఒగా రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగోన్నతులు కల్పించింది. ఈ నేపథ్యంలో గాలివీడు ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమణయ్య డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. మండలంలోని జిఎస్ డబ్ల్యుఎస్‌లకు కొత్తగా డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ అధికారులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘునాథ్‌రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

14న మైదుకూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు ఆర్టీసీ బస్టాండు సమీపాన బి మార్ట్ వద్ద బి.కొత్తపల్లెకు చెందిన గంగిరెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో రుద్రాన్స్ ఆస్పత్రి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గురువారం ప్రముఖ వైద్యులు జి.నాగశేఖర్ రెడ్డి తెలిపారు. గుండె సంబంధిత, ఆర్థో, జనరల్ మెడిసిన్ వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఏకో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం కోరారు. ఎన్టీఆర్ వైద్య సేవ సదుపాయాలు కూడా వర్తించనున్నట్లు చెప్పారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

I.P.No.77/2024

1. వెన్నపూస బాల చెన్నారెడ్డి, తండ్రి పెద్ద చెన్నారెడ్డి, వయసున 46 సం॥లు, హిందూ, వ్యవసాయం, డోర్‌నెం.5/86-సి, పెద్దపసుపుల గ్రామము, పెద్దముడియం మండలం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.
2. పొచ్చిరెడ్డిగారి గవిండ్ల చిన్న నరసారెడ్డి, తండ్రి నడిపి పుల్లారెడ్డి, వయస్సు 50 సం॥లు, హిందూ, వ్యవసాయం, డోర్‌నెం. 1/70, పెద్దపసుపుల గ్రామము, పెద్దముడియం మండలం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా. ... **పిటిషనర్లు/ క్రెడిటార్స్**

Vs.

1. కుడుముల బసన్నగారి వెంకట సుబ్బారెడ్డి, తండ్రి కుడుముల బసన్నగారి సుబ్బారెడ్డి, వయస్సు 53 సం॥లు, హిందూ, టీచర్, డోర్ నెం. 5/54ఎ, పెద్దపసుపుల గ్రామము, పెద్దముడియం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.
2. వెన్నపూస దేవి, భర్త వెన్నపూస చెన్నారెడ్డి, వయస్సు 37 సం॥లు, హిందూ, గృహిణి, డోర్‌నెం. 5/29ఎ, పెద్దపసుపుల గ్రామము, పెద్దముడియం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.
3. ముద్దన లాలిగారి ఈశ్వరరెడ్డి, తండ్రి ముద్దన లాలిగారి పెద్ద నారాయణరెడ్డి, వయస్సు 56 సం॥లు, హిందూ, వ్యవసాయం, డోర్‌నెం. 4/17ఎ, పెద్దపసుపుల గ్రామము, పెద్దముడియం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.
4. చిట్టిబోయిన ఖాదర్‌మోహన్, తండ్రి చిట్టిబోయిన ఖాదరయ్య, వయస్సు 40 సం॥లు, హిందూ, వ్యవసాయం, డోర్‌నెం. 5/62, పెద్దపసుపుల గ్రామ ము, పెద్దముడియం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.
5. కుడుముల గోపిరెడ్డి లక్ష్మిదేవి, భర్త కుడుముల గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వయస్సు 54 సం॥లు, హిందూ, గృహిణి, డోర్‌నెం. ఇ- 126, పులికాట్ నార్, సురుల్ల పేట గ్రామము మరియు మండలం, తిరుపతి జిల్లా.

...రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పిటిషనర్లు క్రెడిటార్స్ ఐపి దాఖలు చేసి ఉంటూ ఉన్నారు. అట్టి క్రెడిటార్స్ ఐపిలో 1వ రెస్పాడెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ మరియు 1వ రెస్పాండెంటు 08-08-2024వ తేదీన 2వ రెస్పాండెంటు పేరుతో, 08-08-2024వ తేదీన 3వ రెస్పాండెంటు పేరుతో, 09-08-2024వ తేదీన 4 & 5వ రెస్పాండెంట్ పేరుతో వ్రాయించిన రిజిస్టరు విక్రయ దస్తావేజులను రద్దు పరచమని కోరుచూ పై కోర్టు యందు పై నెంబరు ఐ.పి.ని దాఖలు చేసి యున్నారు. అట్టి ఐ.పి. యందు ఎవరికైనా, ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టువారి యెదుట **07-01-2026**వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను.

వాయిదా తేదీ : 07-01-2026

//కోర్టువారి ఉత్తర్వు మేరకు//

పి.ఎన్.రంగారెడ్డి
పిటీషనర్, అడ్వకేట్,
ప్రొద్దుటూరు.